# ఈ ముఖం నాకొద్దు

న్యాయపతి కమలారాంజీ

"ఈ అమ్మాయి ఎవరే శ్రావణీ." దమయంతి అడిగింది.

"ఎవరో పోల్చుకో చూద్దాం." సరదాగా అంది శ్రావణి.

దమయంతి పూజని ఎగాదిగా చూసి నిట్టూరుస్తూ.....

"ప్చ్. చెప్పలేనే. ఎక్కడా చూసినట్టు గుర్తు లేదు. నువ్వే చెప్పు."

"అంటే. నువ్వు నిజంగానే గుర్తు పట్టలేదన్న మాట!"

"గుర్తుపడ్తే చెప్పేదాన్ని కదా. ఏమిటీనస. చెప్పు తొందరగా."

"ఇది పూజ. నా కూతురు!"

ఆశ్చర్యపోయి నోట మాట రానట్టుగా అలా ఉండిపోయింది దమయంతి.

"తెలివి ఉండే మాట్లాడుతున్నావా? ఎవరో అమ్మాయిని పట్టుకుని పూజ అంటావేమిటి?" శ్రావణికి మతిస్థిమితం తప్పిందేమోనని దమయంతికి అనుమానం వచ్చింది.

దమయంతి శ్రావణికి ప్రాణ స్నేహితురాలు. చిన్నప్పట్నుంచి యిద్దరూ చాలా క్లోజ్. అనుకోకుండా పెళ్లయి భర్తతో కాపురానికొచ్చినప్పుడు కూడా శ్రావణి దమయంతి యింటి పక్కనే దిగింది. శ్రావణి గతం ఆమెకి బాగా తెల్సు. పూజ ఫ్రెండ్‌ని పట్టుకుని పూజ అంటోందేమో! దివాకర్‌ని వదిలేసి వచ్చేసేక ఆమెకి మతిగాని పోలేదు కదా!" దమయంతి మనసులో ఏదో తెలియని భయం చోటు చేసుకుంది.

"ఏమిటే!



మీకు మతి ఉండే మాట్లాడుతున్నావా? నాకు నిన్ను చూస్తే భయం వేస్తోంది. శ్రావణి! ఆర్ యు ఆల్ రైట్?"

తెరలు తెరలుగా నవ్వుతున్న శ్రావణి ఒక్కసారిగా నవ్వు నాపేసి గంభీరంగా ముఖం పెడ్తూ అంది. "ఇందులో నువ్వు భయపడాల్సిందేమీ లేదు. అది నిజంగా నా కూతురు పూజే."

దమయంతి శ్రావణికి ప్రాణ స్నేహితురాలే గాని... ఆ రోజు శ్రావణి కూతుర్ని తీసుకుని యింట్లోంచి వెళ్లిపోయేక మళ్లీ యిప్పుడే స్నేహితురాలింటికి రావడం! రావాలని మనసు పీకుతున్నా మాటి మాటికి వస్తే దివాకర్ శ్రావణి ఆచూకి కనిపెట్టేసి యిక్కడికి వచ్చి అల్లరి పెడ్తాడేమోనని భయం వేసి ఊరుకుంది.

అసలు శ్రావణిని అంత కష్ట సమయంలో ఆదుకున్నది దమయంతి, ప్రభాకరంలే. ఆమెకి ఉద్యోగం యిప్పించింది కూడా దమయంతి భర్త ప్రభాకరమే.

ఆడదంటే అబల కాదని, తన్నినా - కొట్టినా, పీక పిసికి చంపుతానన్నా కాళ్ల దగ్గర పడి ఉండే దాస్య బుద్ధి, పిరికితనం యిప్పుడు ఎవరికీ లేవని నిరూపించడానికి శ్రావణి ముందడుగు వేసినప్పుడు వాళ్లిద్దరి ప్రోద్బలం ఎంతైనా ఉంది. ఆ కృతజ్ఞత శ్రావణికి తన జీవితపు చివరి శ్వాస వదిలేవరకు ఉంటుంది.

ఆమె బ్రతుకు పుస్తకంలో నచ్చని పేజీ లాంటి వాడు దివాకర్. తనకి నచ్చని పేజీని చింపేసే హక్కు తనకి ఉంది! అందుకే దివాకర్ నుండి దూరంగా వచ్చేసింది. భర్తని వదిలేసి వచ్చేటప్పటికి పూజ వయసు పది సంవత్సరాలు.

పూజ తనకి తెలియక పోవడం ఏమిటి? ఆ ముఖం ఆమెకి ఇప్పటికీ బాగా గుర్తుంది. "అసలు జరిగిందేమిటో చెప్పు తల్లీ! సస్పెన్స్‌లో పెట్టక!" అంది దమయంతి కుర్చీని కాస్త ముందుకి జరుపుకుంటూ.

"ఆంటీ! అమ్మ చెప్పడం ఎందుకు? నేనే చెప్తాను జరిగినదంతా...." అని చెప్పడం మొదలెట్టింది పూజ......

* * *

"అందరూ అద్దంలో ముఖం చూసుకున్నట్టే నేను నా ముఖాన్ని అద్దంలో చూసుకునే దాన్ని. అలా చూస్తున్నప్పుడు నా ముఖం ఒక కిరాతకుడి ముఖానికి జిరాక్స్ కాపీ అని అనిపించగానే ఏడుపొచ్చేది. నా ముఖం చూసి అందరూ అచ్చు గుద్దినట్టు అంతా తండ్రి పోలికే అనేవారు! నాకు వళ్లుమంట అలా వాళ్లు అంటే. అతన్ని నా తండ్రి అని చెప్పుకుందుక్కూడా సిగ్గు నాకు. ఎవరు పడితే వాళ్లు "నువ్వు దివాకర్ కూతురివి కదూ!" అని అడగ్గానే నాకు వాళ్లని పట్టుకుని తన్నాలనిపించేది.

"పూజా! ఎవరేమన్నా నువ్వు పట్టించుకోకు." అనేది అమ్మ. ఎలా పట్టించుకోకుండా ఉంటాను! నాన్నని తల్చుకుంటేనే నాకు వంటి మీద తేళ్లు, జెర్రెలు పాకినట్టుగా ఉంటుంది. తండ్రిని తల్చుకుంటే అసహ్యం! ఆ పేరుని వింటేనే అసహ్యం. ఆయన పేరు ఎవరైనా ఎత్తితే వాళ్లని చితగ్గొట్టాలనిపిస్తుంది. అలాంటిది నా దురదృష్టం కొద్దీ ఆ ముఖం నాకొచ్చింది. ఎంత ఏడ్చేదాన్నో ఆ దేముడికే తెల్సు. అతని మీద ద్వేషం రోజు రోజుకీ పెరిగిపోతూ వచ్చింది నాకు. అమ్మ పడ్డ కష్టాలన్నీ నా కళ్లతో చూసాను. అమ్మ కన్నీటి కథకి నేనే ప్రత్యక్ష సాక్షిని! మీకు తెలిసే ఉంటుంది. నాన్న చేసిన అవకతవక పన్లకి ఉన్న ఉద్యోగం ఊడిపోయింది. పైగా ఎక్కడికి వెళ్లినా ఎవరూ నాన్నకి ఉద్యోగం యివ్వలేదు...

అమ్మ.... అమ్మ అందం భాషకి అందనిది. నున్నటి చెక్కిళ్ల, సూది ముక్కు, వెడల్పయిన కళ్లు, నల్లగా నిగనిగలాడుతున్న వత్తయిన జుట్టు, చిన్న పెదవులు, సన్నటి నడుం, తీరైన ఆకృతి ఆమెది. నాకే ముద్దొచ్చేలా ఉంటుంది అమ్మ! ఒక్క ముక్కలో చెప్పాలంటే అజంతా శిల్పంలా ఉంటుంది అమ్మ! అలాంటి అమ్మని నాన్న ఎప్పుడూ తిట్టడం, కొట్టడం.... అసలు ఆయనకి చేతులెలా వచ్చాయో అమ్మ మీద చేయి చేసుకోవడానికి!

ఒకసారి "ఏవండి! ఎలాగూ మీకు ఉద్యోగం లేదు. ఇల్లు గడవడం కష్టంగా ఉంది. నేను ఉద్యోగం చేస్తానండీ." నెమ్మదిగా అంది అమ్మ.


"శ్రావణీ!" కోపంగా అరిచేరు నాన్న.

"నోర్మూయ్యి. మళ్లీ ఆ మాట ఎత్తేవో జాగ్రత్త" అన్నారు. నివ్వెరపోయింది అమ్మ.

"అంత కాని మాట ఏమన్నానండీ. ఇల్లు గడవడం కష్టంగా ఉంది. ఏ అప్పో, సొప్పో చేద్దామన్నా ఈ మహా నగరంలో మనలాంటి వాళ్లకి అప్పు ఎవరిస్తారు? నేను ఉద్యోగం.... చేసి...."


అంతే! చెంప ఛెళ్లుమంది..

"అవునే. ఉద్యోగం నెపంతో నీ అందాలన్నీ అందరి ముందూ ప్రదర్శించాలనే కదూ! నీ వెధవ ఆలోచన నాకు తెలుసే....! అయినా నాకు తెలికడుగుతాను! నీ కింత.... అందం ఎవడిచ్చాడే! నీ అమ్మ దేభ్యం ముఖం వేసుకుని ఉంటుంది....! మీ నాన్న కలక్టరాఫీసులో ప్యూన్ లాంటి గెటప్ వాడూనూ.... కొంప తీసి మీ అమ్మ నిన్ను..... ఏ దొర బాబుకో కన్నాదేంటి! చెప్పు. చెప్పు." కసిగా అమ్మ జుట్టు పట్టుకుని, తల వంచేసి, వీపు మీద గట్టిగా నాలుగు గుద్దులు గుద్ది.... కోపంగా



### మార్పు

నాలో నాకు తెలియకుండానే చిత్రమైన మార్పు సంభవించింది. ఇంతకు ముందు అందమైన ఆడపిల్లని చూస్తే, మనసు ఆమె నా సొంతం కావాలని ఉబలాటపడేది. ఇపుడు అందమైన ప్రకృతిని చూస్తుంటే ఆ ప్రకృతి ఒడిలో ఒదిగి పోవాలనిపిస్తుంది" అంటున్నాడు సంజయ్‌దత్. (వయసలాంటిది మరి!)



ఆరిచేడు నాన్న!.... అక్కడితో ఊరుకోలేదు. ఇంకా అసభ్యకరమైన భాషలో తిట్లు తిట్ట సాగాడు. కొంత సేపు మౌనంగా తిట్లన్నీ భరించి..... తర్వాత అంది అమ్మ.....

"పక్కింటి ప్రభాకరం అన్నయ్య నాకు ఉద్యోగం చూసి పెడతానన్నారు. నేను ఎలాగూ ఎమ్.కామ్. పాసయి కంప్యూటర్ కోర్సు కూడా చేసేను కదా. ఉద్యోగం చేస్తే తప్పేంటి?"

"ఓ హో అలా చెప్పు. ఆ ప్రభాకరం నీ మీద కన్ను వేశాడన్నమాట! వాడే యిలా మొగుడికి ఎదురు తిరగమని నీకు చెప్పి ఉంటాడు! వాడ్ని అడ్డం పెట్టుకుని.... రంకు వేషాలెయ్యాలని నీ ప్లాను. నాకు తెలీదనుకోకు. నేను చాలా చాలా తెలివైన వాడ్ని. నా తెలివి తేటలు గురించి తక్కువ అంచనా వెయ్యకు. నాకు అంతా తెల్సి పోయింది. నీ అందంతో అందరికీ కనువిందు చెయ్యాలని చూస్తున్నావు. నేను ప్రాణాలతో ఉండగా నిన్ను ఆ పని చెయ్యనివ్వను. నువ్వు ఈ గడప దాటి అవతలకి వెళ్లడానికి వీల్లేదు. నా మాట కాదని వెళ్లావో నిన్ను చంపేసి నేను ఛస్తాను." శూలాల్లాంటి ఆ మాటలతో మనసు ముక్కలైపోతూ ఉంటే ఏం చెయ్యలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది అమ్మ.

నేను అంతా చూస్తూ... ఏడుపుని దిగమింగుకుంటూ అలా ఉండిపోయేదాన్ని.

నాన్నకి అనుమాన పిశాచం పట్టుకుంది! అమ్మ అందం మీద కసి!

అమ్మ కూర్చున్నా, నించున్నా, ఎవరితోనైనా మాట్లాడినా, ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా... అమ్మ మీద అనుమానమే. ఆ ఒక్కరోజే కాదు, ఎప్పుడూ కూడా ఏదో ఒక మిష పెట్టుకుని అమ్మని చావబాదే వాడు నాన్న. అడ్డొచ్చిన నన్ను తోసేసే వాడు! అమ్మని ప్రతి రోజూ మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. బంధువులు.... స్నేహితులు ఎవరూ యింటికి రాకూడదు. ఎవరైనా చుట్టం చూపుగా యింటికొస్తే ఆ రోజు యింట్లో పెద్ద యుద్ధం అయిపోయేది!

నాన్నకి మందు అలవాటు ఉంది. ఆ మందు కోసం ఏం చేసేవాడో, ఎక్కడ్నుంచి డబ్బు వచ్చేదో తెలీదు కాని ఒక్కొక్కసారి తప్ప తాగి యింటికొచ్చే వాడు. ఆ రోజు అమ్మకి నరకం చూపించేవాడు. జాకెట్టు చింపేసి, ముఖం మీద, తొడల మీద సిగరెట్టుతో వాతలు పెట్టేసి.... గిల్లేసి, "రాక్షసుడే చాలా మంచివాడేమో యితనికంటె" అన్నట్టు ప్రవర్తించేవాడు! నాన్నని పెళ్లిచేసుకున్న పాపానికి నరక యాతన అనుభవిస్తున్నా కూడా నోరెత్తకుండా పడివుండే అమ్మ దురదృష్టాన్ని తల్చుకుంటే నా కడుపు తరుక్కుపోయేది.

"నాన్న రాక్షసుడు. ఈ నాన్న మనకొద్దు. నాన్నని వదిలేసి మనం ఎక్కడకైనా వెళ్లిపోదాం" అనే దాన్ని నేను.

ప్రభాకరం మావయ్య అమ్మకి ఒక ఉద్యోగం చూశారు. ఆ సంగతి తెల్సి ఆ రోజు యింట్లో నానా భీభత్సం సృష్టించాడు నాన్న. ఉద్యోగంలో చేరావంటే పీక పిసికి చంపేస్తాను అన్నాడు. రెండు చేతుల్తోనూ నిజంగానే బలంగా పీక నొక్కేయబోతుంటే నేను, అమ్మ గట్టిగా కేకలు పెఅడ్తే వదిలేసేడు. గబగబా బయటకెళ్లి బయట్నుంచి వీధి తలుపు గడియ పెట్టేసి ఎక్కడికో వెళ్లిపోయాడు నాన్న. ఈ విధంగా భర్త చేత చావు దెబ్బలు తింటూ కూడా సమాజానికి, పరువు - ప్రతిష్ఠలకి భయపడి.... తిన్డానికి తిండి, కట్టుకుందికి బట్టా లేకపోయినా ఎన్నాళ్లో భరించింది అమ్మ. సహనానికి మారు పేరు స్త్రీ అంటారు! అసలు సహనానికి సరిహద్దులంటూ లేవా?! ఎన్నాళ్లు? ఎన్నేళ్లిలా? తర్వాత మీరు వచ్చి వీధి తలుపు గడియ తీయబట్టి సరిపోయింది. ఆఖరికి అమ్మ ఒక నిశ్చయానికొచ్చింది.

నాన్న ఎక్కడికి వెళ్లిపోయారో తెలీదు. ప్రభాకరం మావయ్య చూపించిన ఉద్యోగంలో అమ్మ జాయిన్ అయిపోయింది. నాన్నకి ఒక ఉత్తరం వ్రాసి టేబుల్ మీద పెట్టి నన్ను తీసుకుని దూరంగా... యిదుగో యిలా వచ్చేసింది.....

మేం వచ్చేసిన తర్వాత నాన్న యింటికి వచ్చి చాలా గొడవ చేశారని.... తర్వాత అద్దె యిచ్చుకోలేక ఆ యిల్లు ఖాళీ చేసి వెళ్లిపోయారని తెల్సింది. తర్వాత.... ఈ మధ్య అమ్మకి తెల్సిన వాళ్లెవరో వచ్చి చెప్పారు... నాన్న గడ్డం పెంచేసి, మాసిపోయిన బట్టల్తో బస్టాండులోనూ. [illegible] స్టేషనులోనూ అడుక్కుంటున్నారని!! అది విన్నాక అమ్మకి ఏడుపు రాలేదు. నాకైతే "మంచి పని అయింది! అతనికి అలా జరగాల్సిందే" అనిపించింది!"

"అమ్మా! ఈ ముఖం నాకొద్దు. అద్దంలో నా ముఖం నేను చూసుకున్నప్పుడల్లా నాన్న గుర్తుకొస్తాడు. నాన్న జ్ఞాపకం వస్తే మనసంతా అదోలా, బలవంతంగా చేదు మింగినట్టుగా అయిపోతోంది. చూసిన అందరూ నన్ను 'అచ్చు దివాకర్‌లాగే వుంది' అంటూంటే ఎందుకో నాకు చాలా చిరాగ్గా ఉంది. చెడ్డ తండ్రి వల్ల బాధలు పడిన ఏ పిల్లకైనా యిలా అనిపిస్తుందో లేదో నాకు తెలీదు. కాని నా మటుకు నా ముఖం మీద ఏసిడ్ పోసేసుకోవాలని అనిపిస్తోంటమ్మా" అన్నాను ఏడుస్తూ.

నేనూ అనగానే అమ్మ నన్ను పట్టుకుని ఏడ్చేసింది. సరిగ్గా అప్పుడే నాకో అద్భుతమైన ఆలోచన వచ్చింది. నా ఫ్రెండ్స్‌తో కల్సి అప్పుడప్పుడు బ్యూటీ పార్లర్‌కి వెళ్తు ఉంటాను. అక్కడే తెల్సింది ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ చేస్తారని. అమ్మకి చెప్తే అమ్మ ముందు వద్దంది. "ఇప్పుడు సైన్స్ బాగా అభివృద్ధి చెందింది. నిజమే. కాని ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే సైడ్ ఎఫెక్ట్స్ ఏవైనా ఉంటాయేమో! లేనిపోని కాంప్లికేషన్స్ వస్తే జీవితాంతం అవస్థపడాలి." అంది అమ్మ భయంగా.

"లేదు మమ్మీ! నా ఫ్రెండ్‌కి తెల్సిన డాక్టరు ఒకాయన ఉన్నారు. ఈ మధ్యనే ఫారిన్ నుండి వచ్చారట. ఇలాంటి సర్జరీలో ఆయన నిపుణులట. అడిగి చూద్దాం" అని పట్టుబట్టాను.

"ఈ ఒక్క కోరికా కాదనకు మమ్మీ... ప్లీజ్" నా పంతం నాది. అప్పటికే అమ్మ అదోలా ముఖం పెట్టింది. అమ్మకిష్టం లేదు ఎందుకనో. కాని నా పట్టుదలే నాది." ఈ విషయం కాదని అడ్డుపడితే నీకు చెప్పా పెట్టకుండా నేను యింట్లోంచి వెళ్లిపోతాను. మరెప్పటికీ నీకు కనిపించను." అఖరి అస్త్రం ఉపయోగించాను. పాపం మమ్మీ ఆఖరికి ఒప్పేసుకుంది.

"ఆ డాక్టరు గారు నిజంగా మంచి ఎక్స్పర్ట్ ఆంటీ! మీరు నన్ను గుర్తు పట్టలేకపోయారంటే ఇహ నో ప్రాబ్లం!! కదూ మమ్మీ. నేను సక్సెస్ అయినట్టే కదా." సంతోషంతో చిన్న పిల్లలా చప్పట్లు కొడ్తూ అంది పూజ!

"పిచ్చి పిల్లా! ముఖం మీది పోలికలు చెరిపేసుకున్నా మనసులో ఉన్న అతని జ్ఞాపకాలని దేంతోనూ చెరుపుకోలేవు!" అనుకుంది శ్రావణి బాధగా

❃



## ఎవరికోసం?

'ఋణానుబంధ రూపేణా పశుపత్ని సుతాలయ' అన్నారు పెద్దలు. ఆ విషయం నూటికి నూరు పాళ్ళూ నిజం అనిపిస్తుంది. కమల్‌హాసన్ విషయంలో. మోజు పడి పెళ్ళి చేసుకున్న సారికకు గుడ్‌బై చెప్పేశాడు ఇటీవల. మరి కూతురేం చేస్తుంది? ఎవరితో వుంటుంది? వుంటే గింటే ఎంతకాలం వుంటుంది? ఇది సారిక ఆలోచించాలి.